క్లుప్తంగా

ఆధార్ అనుసంధానం చేయండి



మాట్లాడుతున్న ఎన్నికల అధికారి శ్రీనివాసులు

బుచ్చినాయుడుకండ్రిగ: ఓటరు కార్డుకు ఆధార్ అనుసంధాన ప్రక్రియను వేగవంతం చేయాలని నియోజక వర్గ ఎన్నికల అధికారి, డిప్యూటీ కలెక్టర్ శ్రీనివాసులు తెలిపారు. ఆయన మంగళవారం తహసీల్దారు కార్యాలయంలో బీఎల్ఓలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఓటరు కార్డుకు ఆధార్ అనుసంధానంతో ఒక్కరికి ఒక ఓటు మాత్రమే ఉంటుందని, తప్పని సరిగా అనుసంధానం చేయాలన్నారు. ఓటరు ఫొటో బాగా కనిపించేలా ఉండాలని తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్‌ను అమలు చేయాలన్నారు. పోలింగ్ బూత్‌లలో అన్ని సౌకర్యాలు ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. డిప్యూటీ తహసీల్దార్ శివయ్య, ఆర్ఐ వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల అందజేత

శ్రీకాళహస్తి: పట్టణ శివారులోని విశాలాక్షినగర్‌కు చెందిన ఓ పేద కుటుంబానికి హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ మంగళవారం నిత్యావసర సరుకులు అందజేసింది. విశాలాక్షి నగర్‌కు చెందిన అమీర్‌బాషా, షఫీ ఉన్నిసా దంపతులు తవ జీవనానికి ఇబ్బందిగా ఉందని నిత్యాసర సరుకులు అందజేయాలని హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థను కోరారు. స్పందించిన వారు మంగళవారం వాటిని అందజేశారు. సంస్థ వ్యవస్థాపకుడు మునీర్‌బాషా మాట్లాడుతూ ప్రతి నెలా తమ కార్యాలయంలో నిత్యావసర సరుకులు ఇచ్చే సమయంలో వచ్చి తీసుకెళ్లాలని సూచించారు. సభ్యులు గరికపాటి రమేష్‌బాబు, కోళ్లూరు హరినాథ్‌నాయుడు పాల్గొన్నారు.

3,4 తేదీల్లో చిరు వ్యాపారుల మహాసభ



పోస్టర్లను విడుదల చేస్తున్న నాయకులు

సత్యవేడు : గూడురులో మార్చి 3,4 తేదీల్లో జరిగే తిరుపతి జిల్లా వీధి విక్రదారుల మహాసభను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ సత్యవేడు నియోజకవర్గ కార్యదర్శి ఆంబాకం చిన్నిరాజ్ కోరారు. మంగళవారం ఆయన సత్యవేడులో చిరువ్యాపారులతో కలసి మహాసభ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ వీధి వ్యాపారులకు వడ్డీలేని రుణాలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించాలని డిమాండ్ చేశారు. గుర్తింపుకార్డులు మంజూరు చేయాలన్నారు. సీఐటీయూ నాయకులు మురళి, నాప కృష్ణమూర్తి, చిరు వ్యాపారుల సంఘం నాయకుడు తరుణ్‌కుమార్, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

కళాశాల అభివృద్ధికి రూ.3లక్షల విరాళం



దశరథరెడ్డిని సన్మానిస్తున్న అధ్యాపక బృందం

ఏర్పేడు: మండలంలోని పాపానాయుడుపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల అభివృద్ధికి దాత దశరథరెడ్డి మంగళవారం రూ.3 లక్షలు విరాళంగా అందజేశారు. చిత్తూరుకు చెందిన అమ్మ యాక్స్ సీఈఓ దశరథరెడ్డి కళాశాల ఆవరణలోని ఆట స్థలం ఎత్తు పెంచేందుకు రూ.లక్ష, అధ్యాపకుల సిటింగ్ కుర్చీలు, బల్లల కోసం రూ.2 లక్షల నగదు విరాళంగా అందజేశారు. దాతను ప్రిన్సిపల్ ప్రభాకర్‌రెడ్డి, అధ్యాపకులు ఘనంగా సన్మానించారు.

జగనన్నతోనే వడ్డెరలకు సమన్యాయం



వెంకటరమణ

కేవీబీపురం: ఎమ్మెల్సీ అభ్యర్థుల నియామకాల్లో వడ్డెర కులస్తులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సముచిత స్థానాన్ని కల్పించారని మండలంలోని ఎస్‌ఎల్‌పురం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు, వడ్డెర సంఘం రాష్ట్ర యువత అధ్యక్షుడు బత్తుల వెంకటరమణ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వాలు వడ్డెరలను ఓటు బ్యాంకుగానే చూశాయని, తగిన గుర్తింపు ఇవ్వలేదన్నారు. వడ్డెరులను గుర్తించి రెండు ఎమ్మెల్సీ స్థానాలకు అభ్యర్థులుగా ఎంపిక చేసిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలుస్తామని తెలిపారు.

కండలేరులో 45.876 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో మంగళవారం 45.876 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్‌రెగ్యులేటర్ నుంచి సత్యసాయి గంగ కాలువకు 1,210 క్యూసెక్కులు, పిన్నేరువాగుకు 130, మొదటి బ్రాంచ్ కెనాల్‌కు 60, లోలెవల్ స్లూయీజ్‌కు120, హైలెవల్ స్లూయీజ్‌కు 140 క్యూసెక్కుల వంతున విడుదల చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

పార్వతీ పరమేశ్వరుల

పెళ్లి సందడి

శ్రీకాళహస్తి క్షేత్రంలో సోమవారం అర్ధరాత్రి నుంచి మంగళవారం తెల్లవారు జాము వరకు భక్తవత్సలుడి పెళ్లి సందడి నెలకొంది. మహా శివరాత్రి బ్రహ్మోత్సవాల్లో ప్రధాన ఘట్టమైన శ్రీజ్ఞానప్రసూనాంబ అమ్మవారు, శ్రీకాళహస్తీశ్వరస్వామి కల్యాణం కనులారా వీక్షిందుకు వచ్చిన భక్త జనం వీక్షించి తరించారు. పట్టణంలోని పెండ్లిమండపం సెంటర్ నలువైపులా భక్తజనం కిక్కిరిశారు. ఆలయం నుంచి వధూవరులుగా స్వామి, అమ్మవార్లు వేంచేపు చేయడం, కల్యాణం అనంతరం ఒక్కటిగా ఆలయానికి ఊరేగింపుగా చేరుకునే సమయంలో ఓం నమశ్శివాయ నామస్మరణలు మిన్నంటాయి. స్వామి, అమ్మవార్ల కల్యాణ ముహూర్త సమయంలో అనేక జంటలు ఒక్కటయ్యాయి. మంగళవారం ఉదయం నూతన వధూవరులుగా ఆలయం నుంచి స్వామి, అమ్మవార్లు ఎడ్లబండ్లపై పురవీధుల్లో విహరించారు. – శ్రీకాళహస్తి





నూతన వధూవరూలుగా ఎడ్ల బండ్లపై స్వామి, అమ్మవార్ల పుర విహారం



కల్యాణోత్సవాన్ని వీక్షిస్తున్న అశేష భక్తజనం



శివపార్వతుల కల్యాణోత్సవ సమయానికి ఒక్కటైన జంటలు

ఆ స్థలం పాఠశాలకు చెందిందే

- సుదీర్ఘకాల భూ సమస్యకు పరిష్కారం
- ఆ స్థలంలో ఆర్‌బీకే నిర్మాణం
- తహసీల్దార్‌ను సత్కరించిన గ్రామస్తులు



తహసీల్దార్‌ను సత్కరిస్తున్న గ్రామస్తులు

వరదయ్యపాళెం: మండలంలోని పెద్ద పాండూరులో సుదీర్ఘకాల భూ సమస్య పరిష్కారమైంది. ఇందుకు చొరవ చూపిన తహసీల్దార్ గౌరిశంకరరావును గ్రామస్తులు మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో సత్కరించారు. వివరాలు.. పెద్ద పాండూరు గ్రామ పరిధి సర్వే నంబరు 915/బీలో 4.26 ఎకరాల భూమిని సిద్దేశ్వరపురం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు కేటాయించారు. ఈ భూమిలో అదే గ్రామానికి చెందిన కె.జయలక్ష్మి ఏడేళ్ల కిందట 1.70 ఎకరాలను ఆక్రమించుకుని నకిలీ పట్టాను పొందారు. ఈ విషయమై గ్రామస్తులు అభ్యంతరం వ్యక్తం చేయడంతో ఆమె హైకోర్టును ఆశ్రయించగా, ఆ కేసును కోర్టు తిరస్కరించింది. అయితే తమ పట్టాదారు పాసుపుస్తకాలు సక్రమమేనని సీసీఎల్ విభాగాన్ని ఆశ్రయించారు. గ్రామస్తులు సమస్య పరిష్కారం కోసం అప్పటి నుంచి పలుమార్లు గతంలో ఉన్న తహసీల్దార్‌లకు విన్నవించినా ఫలితం లేదు. తాజాగా బాధ్యతలు స్వీకరించిన గౌరిశంకరరావుకు గ్రామస్తులు సమస్యను విన్నవించడంతో 3 నెలలుగా రికార్డులు పరిశీలించి సీసీఎల్ కోర్టుకు పూర్తిస్థాయి వివరాలతో కూడిన నివేదికను సమర్పించారు. దీంతో కె.జయలక్ష్మి రికార్డులను నకిలీవిగా నిర్ధారించి కేసును కొట్టివేశారు. దీంతో 4.26 ఎకరాల భూమి పూర్తిగా ప్రభుత్వానికి చెందినదేనని ధృవీకరించారు. ప్రస్తుతం ఆ స్థలంలో రైతు భరోసా కేంద్రం నిర్మాణం చేయాల్సి ఉంది. అంతేకాక ఆ స్థలం నుంచి శ్రీవేంకటేశ్వర గిరిజనకాలనీకి రోడ్డును ఏర్పాటు చేయాల్సి ఉంది. సుదీర్ఘకాల సమస్యకు దారి చూపిన తహసీల్దార్‌ను గ్రామస్తులు ఘనంగా సత్కరించారు. సత్కరించిన వారిలో పెద్ద పాండూరుకు చెందిన వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నాయుడు దయాకర్‌రెడ్డి, మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితులు దామోదర్‌రెడ్డి, స్థానిక బీజేపీ నాయకులు భాస్కర్‌రెడ్డి, స్థానిక మాజీ సర్పంచ్ నాగరాజు యాదవ్ తదితరులు ఉన్నారు.

ఉపాధి కూలీలకు గరిష్ట కూలి



పనులను పరిశీలిస్తున్న డ్వామా పీడీ

పిచ్చాటూరు: ఉపాధి పనుల్లో కూలీలకు గరిష్ట కూలి వచ్చేలా పనులు కల్పించాల్సిన బాధ్యత క్షేత్ర, సాంకేతిక సహాయకులదేనని డ్వామా పీడీ శ్రీనివాస ప్రసాద్ తెలిపారు. మంగళవారం మండలంలోని శివగిరిలో ఉపాధి హామీ పథకం కింద చేపడుతున్న అమృత్ సరోవర్ పనులను పీడీ పరిశీలించారు. పనుల ప్రదేశానికి చేరుకున్న ఆయన కూలీలతో మాట్లాడుతూ ఉదయం, సాయంత్రం రెండు వేళలా పనుల్లో పాల్గొనాలన్నారు. కూలీల హాజరు రిజిస్టర్‌ను పరిశీలించారు. మండలంలో కూలీల సంఖ్యను గణనీయంగా పెంచాలని ఏపీఓ సుధాకర్‌కు సూచించారు. పనుల్లో నాణ్యత ఉండేలా చూడాలని జేఈ భాస్కర్‌ను ఆదేశించారు. ఉపాధి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సీజేఎఫ్ భూములకు పట్టాలివ్వండి

వరదయ్యపాళెం: మండలంలోని ఎల్లకట్టవ గ్రామంలో సీజేఎఫ్ భూములకు వ్యక్తిగత పట్టాలు ఇవ్వాలని గ్రామస్తులు మంగళవారం తహసీల్దార్‌ను కలసి విన్నవించారు. తహసీల్దార్ గౌరిశంకరరావు వారితో మాట్లాడుతూ.. స్థానిక ఎమ్మెల్యే సూచనల మేరకు వ్యక్తిగత పట్టాల పంపిణీకి సిద్ధం చేస్తున్నామని తెలి పారు. అయితే చిన్నపాటి సమస్యలను గ్రామస్తులు ఐక్యంగా పరిష్కరించుకుంటే త్వరతగతిన పట్టాలు పంపిణీ చేస్తామని సూచించారు.

ఘల్లు ఘల్లు ఘల్లుమంటు..



చాగంటిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి, ఆలయ చైర్మన్, ఈఓ



శ్రీకాళహస్తి రూరల్: శ్రీకాళహస్తీశ్వరస్వామి ఆలయ మహా శివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా ధూర్జటి కళా ప్రాంగణం వేదికపై మంగళవారం జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు అనుగ్రహ భాషణంతో భక్తులు తన్మయులయ్యారు. తిరువూరుకు చెందిన గోదా నాగమణి బృందం భక్తి రంజని, ద్వారం లక్ష్మి శాస్త్రీయ భక్తి గీతా లహరి ఓలలాడించాయి. చాగంటిని ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి, దేవస్థానం చైర్మన్ శ్రీనివాసులు, ఈఓ సాగర్‌బాబు సత్కరించారు.





నృత్య ప్రదర్శనలు





చాగంటి కోటేశ్వరరావు ప్రవచనం

క్రికెట్ టోర్నీ విజేత సీబీఆర్‌ఏ జట్టు



షీల్డు అందుకున్న జట్టుతో చీఫ్ వర్క్స్ మేనేజర్ దేవసహాయం

రేణిగుంట: రేణిగుంట రైల్వే సీఆర్‌ఎస్(క్యారేజి రిపేర్ షాప్) ఉద్యోగుల క్రికెట్ టోర్నీ విజేతగా సీబీఆర్‌ఏ జట్టు నిలిచింది. మంగళవారం వెస్ట్ కాలనీ మైదానంలో ఫైనల్స్ రసవత్తరంగా జరిగాయి. ఈనెల 5వ తేదీ నుంచి ఇక్కడ మొత్తం 10 జట్లకు లీగ్ పోటీలు జరిగాయి. ఫైనల్స్‌లో సీబీఆర్‌ఏ జట్టు, పెయింట్ షాప్ జట్టు ఫైనల్ మ్యాచ్‌లో తలపడ్డాయి. పెయింట్ షాపు జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 143 పరుగులు చేయగా, సీబీఆర్‌ఏ జట్టు 18 ఓవర్లలోనే 147 పరుగులు చేసి విజేతగా నిలిచింది. సీఆర్‌ఎస్ చీఫ్ వర్క్స్ మేనేజర్ దేవసహాయం విజేతలకు జ్ఞాపికలు, షీల్డులు అందజేశారు. బ్రాంచ్ డెలిగేట్ నరేంద్రకుమార్ సొంత నిధులతో మెడల్స్‌ను బహూకరించారు. మజ్దూర్ యూనియన్ సెక్రటరీ సురేంద్రరెడ్డి, సీఆర్‌ఎస్ స్పోర్ట్స్ ఆఫీసర్ ఉదయ్‌కిరణ్, సెక్రటరీ గుణశేఖర్, టోర్నీ నిర్వాహకులు, కార్మిక సంఘ నేతలు పాల్గొన్నారు.

మూడు ఇసుక ట్రాక్టర్ల సీజ్

ఏర్పేడు: మండలంలోని వికృతమాల వద్ద ఇసుకను అక్రమంగా తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు ఏర్పేడు సీఐ శ్రీహరి మంగళవారం తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు వికృతమాల సమీపంలోని స్వర్ణముఖి నదినుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న మూడు ట్రాక్టర్‌లను స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. యజమానులపై కేసులు నమోదు చేసినట్లు చెప్పారు.

మాతృభాష పరిరక్షణ అందరి బాధ్యత

శ్రీకాళహస్తి: పట్టణంలోని పలు కళాశాలలు, పాఠశాలల్లో మాతృభాష దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని పురుషుల డిగ్రీ కళాశాలలో జరిగిన వేడుకల్లో ప్రిన్సిపల్ నాగరాజునాయుడు మాట్లాడుతూ తెలుగు భాష ఔన్నత్యాన్ని వివరించారు. పరభాషల మోజులో పడి అమ్మభాషను మరవ కూడదని తెలిపారు. మనుగడ కోసం ఇతర భాషలు నేర్చుకోవచ్చని, వాటి ప్రభావం మాతృభాషపై పడకూడదన్నారు. తెలుగు భాషపై పట్టు, పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. అనంతరం వివిధ పోటీల విజేతలకు బహుమతులను అందజేశారు. వైస్ ప్రిన్సిపల్ మురళి, అధ్యాపకులు కట్టా సుబ్బారావు, సంక్రాంతి రాజేంద్రుడు తదితరులు పాల్గొన్నారు. ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఇన్‌చార్జి ప్రిన్సిపల్ దీనదయాల్ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. అధ్యాపకులు గీత, నరసింహరావు తది తరులు పాల్గొన్నారు.

సత్యవేడు: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీకళాశాల ప్రాంగణంలో మాతృభాష దినోత్సవాన్ని నిర్వహించారు. ప్రిన్సిపల్ సురేష్ బాబు మాట్లాడుతూ తెలుగుభాష మాధుర్యాన్ని వివరించారు. తెలుగు అధ్యాపకులు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ తెలుగు భాషను కాపాడు కోవడం అందరి బాధ్యత అన్నారు. వ్యాసరచన, వక్తృత్వ పోటీల విజేతలకు బహుమతులను అందజేశారు. వైస్ ప్రిన్సిపల్ శ్యామూల్ అరవింద్, అధ్యాపకులు ఎస్.హరిప్రసాద్, మురళీమోహన్, హన్నా, ఢిల్లీప్రసాద్, రవిశంకర్, కీర్తి, ఎస్ హరిప్రసాద్ పాల్గొన్నారు



ఏర్పేడు : పుస్తకాలు అందుకున్న విద్యార్థులు

మాతృభాషను విస్మరించకూడదు

బుచ్చినాయుడుకండ్రిగ: దేశ భాషలందు లెస్సగా కీర్తిని అందుకున్న తెలుగుభాషను పరభాషా వ్యామోహంలో విస్మరించ కూడదని తెలుగు ఉపాధ్యాయుడు, అభ్యుదయ రచయితల సంఘం జిల్లా అధ్యక్షుడు యువ శ్రీమురళి అన్నారు. కల్లివెట్టు, నెలవాయి జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో మంగళవారం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని తెలుగు పండితులు యువశ్రీమురళి, పురుషోత్తం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు తెలుగుతల్లి, తెలుగు రచయితల వేషధారణల్లో ఆకట్టుకున్నారు. పురవీధుల్లో విద్యార్థులు ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భాషోన్నతి కోసం తెలుగు భాషాభివృద్ధి మండలి చర్యలు తీసుకోవాలని, మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం వ్యాస రచన, పద్యపఠన పోటీలలో ప్రతిభ చూపిన విద్యార్థులకు విజ్ఞానాన్ని పంచే పుస్తకాలు, పెన్నులను, బహుమతులుగా అందించారు. ప్రధానోపాధ్యాయులు రమణయ్య, రాజశేఖర్, విజయకుమారి పాల్గొన్నారు.

ఏర్పేడు: మండలంలోని పాపానాయుడుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం తెలుగు భాషోదినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులకు తెలుగు భాష ప్రాముఖ్యతను రచయిత నామిని సుబ్రమణ్యం వివరించారు. ఆయన రచించిన ప్రపంచ ప్రఖ్యాత ఈసఫ్ నీతి కథలు, చిన్నబ్బ కథల పుస్తకాలను విద్యార్థులకు పంపిణీ చేశారు. ప్రధానోపాధ్యాయుడు జయకుమార్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



శ్రీకాళహస్తి : బహుమతిని అందజేస్తున్న అధ్యాపకులు



సత్యవేడు : మాట్లాడుతున్న ప్రిన్సిపాల్



కల్లివెట్టులో బహుమతులు అందుకున్న విద్యార్థులు